# విచ్చిపోయిన మిస్టరీ

"భద్రం?"

"ఏం, గురో?"

"ఇహ లాభం లేదు, భద్రం !"

"అదేంటి గురో ?"

"ఈ డిటెక్టివు అవతారం చాలించాల్సిందే !"

"ఎందుగ్గురో ?"

"నన్ను చూస్తే నాకే చిరాకుగా వుంది."

"అట్టా బాధపడరాదు, గురో. మనకేంటి తక్కువయింది ?"

"డబ్బులేదు. కేసుల్లేవు. మేడలేదు. మెట్లులేవు. కారులేదు. కనీసం ఆటో కూడా లేదు. టెలిఫోన్ లేదు. కండిషండి లేదు, భద్రం ?"

"గురో ?"

"పక్కన ఒక అమ్మాయి ఉంటే ఏమంత ఫరవా లేదేమో అనిపిస్తున్నట్టుగా ఉంది. నీ ఉద్దేశ్య మేమిటి ?"

"ఎందుగ్గురో ?"

"అప్పుడప్పుడు వెంగెంగా చూట్టానికి !"

"మట్టిబుర్ర ! అది చూడదు. మనం దానికేసి వెంగెంగా చూస్తాం."

"ఎందుగ్గురో ?"

"ఎందుకేంటి ? నేను సిగిరెట్టు నోట్లో పెట్టేసుకుంటే అగ్గిపుల్ల గీసి మూతికి అంటించటానికి."

"ఈ ఐడియా ఎప్పుడొచ్చింది, గురో ?"

"రాత్రి కలొచ్చింది, భద్రం. నేను డిటెక్టివుల క్లబ్బు కెళ్లానుట. అక్కడ గొప్ప డిటెక్టివులంతా ఉన్నారు. అందులో ఒకడున్నాడు చూస్కో ! రెండు చేతులా గబ గబా తిని బిల్లడిగాడు. బిల్లు ఆరున్నర అయింది. బిల్లు చెల్లించి కిందికి దూకి, మళ్ళా పైకి దూకి, మళ్ళీ ఇంకో భోజనం చేసి ఏడున్నర చెల్లించాడు ! డిటెక్టివంటే ఆ పాటి తిండిపుష్టి ఉండాల్సిందే! అయిందా ? అమ్మాయంటినే, ఒక డిటెక్టివు కుందా అమ్మాయి; తన కేదన్నా కావలిసినప్పుడల్లా అమ్మాయికేసి వెంగెంగా చూస్తాడు."

"ఇంకేం కనపడింది, గురో ?"

"చేతికర్ర పైపు."

"అంటే?"

"దొరలు కాలుస్తారే, అటువంటిది. చాలా పొడుగుంది. డిటెక్టివు అది నోట్లో పెట్టుకుని తల అటూ ఇటూ తిప్పినప్పుడల్లా ఎవరో ఒకరు పడిపోతుంటారు... భద్రం, ఈ డిటెక్టివు చాపల తొట్లో క్లూలు వెతకటం నేను కళ్ళారా చూశాను."

"మీరేం చేశారు, గురో?"

"నాకు వాళ్ళని చూట్టంతో సరిపోయింది."

"తరవాతేమయింది, గురో?"

"అర్ధాత్తుగా తొమ్మిదయింది. అర్ధాత్తుగా వాన ప్రారంభమయింది. అర్ధాత్తుగా డిటెక్టివు లందరూ కిటికీలోంచి తలలు బయటపెట్టి తడుపుకున్నారు. ఆకాశాన మబ్బు లున్నట్టు ఒక డిటెక్టివు కనిపెట్ట గలిగాడు. ఇంకో డిటెక్టివు వాన కురుస్తున్నదని కనిపెట్ట గలిగాడు. వాన వంకపెట్టి ఒక్కొక్కరే జారుకున్నారు... వాళ్ళ కార్లు చూడాలి, భద్రం. ఒక కారు చూసో్కా, ఎంత పిలిచినా పలకదు."

"అదేంటి, గురో?"

"మౌనం! ఒకటే మౌనం!... చూడు, భద్రం ఒక డిటెక్టివు లారీలో పోతాడు! నా కళ్ళని నేనే నమ్మలేదు."

"అబద్ధం గురో! లారీల్లోనూ, ట్రక్కుల్లోనూ డిటెక్టివులు పోతేం?"

"చిన్నసైజు చెత్తబండి అల్లే ఉంది, భద్రం!"

"అది జీపై ఉంటుంది, గురో!"

"జీపా? వెనక చక్రాలు సరిగా నేలనానవు, లేస్తూ పడుతూ ఉంటాయి. అదేనా జీఫ్?

"అన్ని జీపులూ అట్టా ఎగిరిపడతయ్యా? అందులో ఏదోమిస్టికున్నుంటుంది గురో!"

"మోటారు సైకిల్ తూనీగల్లే దొర్లుకుంటూ రయ్యిన పోవటంలో కూడా మిస్టిక్కుం దంటావా?"

"అభ్యంతరవేంటి, గురో?

భద్రంకేసి ఆలోచనగా పాతిక నిముషాలు చూసి, "ఈ డిటెక్టివు పని మనవల్ల కాదు, భద్రం!" అన్నాను.

భద్రం నాకేసి పదిహేను నిమిషాలు హాశ్చర్యంగా చూసి, "మళ్ళా మొదటి కొచ్చారా' గురో?" అన్నాను.

"అంగులు చాలా ఉండాలి, భద్రం. మన కవేవీ లేవు," అంటూ అరిచాను.

"ఆ సంగతి అనిక చూసుకుందాం. ముందు మీ కల మాట చెప్పండి, గురో! అన్నాడు భద్రం.

"ఏం చెయ్యనూ? క్లబ్బులో ఎవరూలేరు. నేను కూడా ఒక డిటెక్టివు వెంటపెళ్ళాను.

డిటెక్టివుకు ఒక అమ్మాయి ఎదురొచ్చి చిందించింది."

"అదేంటి, గురో. అన్నట్టు వానగాదూ ?"

"వానగాదు, వొంగసుసూగాదు, చిరునవ్వులు చిందించింది."

"తరవాత గురో ?"

"ఫోందేసి పైకెళ్ళి రేడియో పెట్టి కూచున్నాడు తరవాత తరంగాలలో ఊగిసలాడాడు."

"రేడియో తరంగాలా, గురో !"

"భావ తరంగాలలో ఎవరో వచ్చిందాకా ఊగిసలాడుతున్నాడు. తరవాత ఆ వచ్చిన వాసూ ఈ డిటెక్టివూ, మీసాల్ని గురించి పరాచకాలాడు కొన్నారు. చివరికి డిటెక్టివ్ ఎందు కొచ్చావని అడిగాడు. 'అన్నట్టు నాకు ప్రమాదం,' అన్నాడు మీసాలాయన !"

"అమోహం గురో ! తరవాత ఏం జరిగింది ?"

"నాకంత బాగా జ్ఞాపకం రావటం లేదు, భద్రం... రేపు జరగబోయే హత్య గురించి ఇవాళ సాయంకాలం పత్రికలో చూశాడనుకుంటా, డిటెక్టివు ?"

"అదేంటి, గురో ?"

"యెర్రిమొగమా ? రేపటి పేప రివాళే వస్తుందిగా ?"

"తెలిసింది గురో ?"

"తరవాత ఎందుకోగాని డిటెక్టివు కారు రయ్యిన బాణం లాగా శానామారం దూసుకు పోయింది."

"సినిమా స్టార్లకన్న డిటెక్టివులే నయం, గురో !"

"అదేమిటి !"

''మొన్న స్పీడెళ్ళిందని సినిమా స్టారుకు జుల్మానా యేశారు. డిటెక్టివు ఎంత దూసుకు పోయినా అడిగే నాకొడుకు లేడు !''

''మరి డిటెక్టివులంటే యేంటనుకున్నావు, భద్రం ? దూసుకు పోవచ్చు. దొర్లుకు పోవొచ్చు. తార్రోడ్డు అమాంతం మింగెయ్యొచ్చు కూడా... అయిందా ? ఏంటంటున్నానూ? ఆఁ ఆ యింటికెళ్ళాను !''

ఏ యిల్లు గురో ?

''అదేదో యిల్లులే. అడ్డం తగలమాక. ముందు హాలుందా ? అంతా బురద. బురద యెంట పోతే గదిలోకి పోయాం. గది తలుపు తోస్తే తెరుచుకుంది. ఇంకేముందీ ? చచ్చి పడున్నాడు ! కాళ్ళ కింద బురద ఉందిగాని కాళ్ళకి బూట్లులేవు. హంతకుడు బూట్ల కోసం గొంతు పిసికేశాడని అప్పుడే అనుకున్నా. ఇక్కడే డిటెక్టివుకో అన్యాయం కూడా చేశా, భద్రం !''

''ఏం చేశావు, గురో ?''

''ఆ డిటెక్టివున్నాడే, తలుపు తెరిచి అట్లా శవంకేసి చూసి అటు నించి అటే వీధిలోకి

పరుగెత్తాడు. బెదిరాదనుకున్నా చెప్పొద్దూ."

"మీరేం చేశారు, గురో ?"

"మంచి కేసు దొరికింది గదా, డిటెక్షన్ చేసి పారేద్దామనుకున్నా, కాని గదిలోకి పోవటానికుంటేగా ?"

"ఏం, గురో ?"

"గది గవులు కంపు, భద్రం ! మన గవరయ్య మామ చెప్పలా ? ఒక విధమైన గ్యాసు ! అది వొదిలాడు అంతకుడు !"

"అహ తైరీ ! తరవాతేమయింది, గురో ?"

"చెబితినిగా ! అంతా అయోమయంగా ఉంది. ఎవరో ఆడకూతుర్ని చూడబోయాం. మొహాన దొంతర్లు !"

"ఏం దొంతర్లు, గురో ?"

"సిగ్గు దొంతర్లు !"

"నా సిగ్గు సిఁవడా ! ఆ తరవాత ?"

"ఇన్ని మాటలెందుకు, భద్రం. ఆ డిటెక్టివుల అంగులు మనకేం లేవు. వాళ్ళదే పుటకంటే ! నువ్వూ నేనూ వొట్టి యదవ సన్నాసిన్నర సన్నాసులం.

"నామాటిని ఎగస్టార్రి యాసాలేద్దాం, పద గురో ! పరువుచెడ్డా ఫలం ఉంటుంది !"

"కేయాస్‌గారేదో కేసులో ఉన్నట్టున్నారే !" అంటూ శంకరం గారొచ్చారు.

"శంకరం బాబూ, గురోజీకి మీరన్నా చెప్పండి ! మహా నిరాశన పడుతున్నారు !" అన్నాడు భద్రం.

"నిరాశ దేనికి ?" అన్నాడు శంకరంగారు.

"ఆయనకి కల్లోకూడా డిటెక్టివు బూతాలు ఎంటపడుతుంటే !" అన్నాడు భద్రం.

"కేయాస్, నీకు నిజంగా డిటెక్టివు కావాలనుందా ?" అన్నాడు శంకరం గారు.

"ఉండేం లాభం లెండి, అంగుల్లేక పోయినాక ?" అన్నాను అతాశతో.

"మిగిలిన డిటెక్టివులెట్లా గొప్పవాళ్ళయ్యారో నీకు తెలుసా ?"

"తెలీకేం ? వాళ్ళ కమ్మాయి లున్నారు వెంగెంగా చూట్టానికి. నేమ ఏ అమ్మాయి కేసన్నా వెంగెంగా చూస్తే పెణతూడుతుంది మరి ! అసలు నా కమ్మాయిలంటే బయమనుకోండి !"

"నీకు అమ్మాయి నిచ్చేశాను తీసుకో ! ఇంకేం కావాలి ?"

"మెట్లు !".

"ఇచ్చేశా."

"దూసుకు పొయ్యే ఆటో !"

"కావలిస్తే విమానం ఇస్తా తెలిసిందా ? హెలికోప్టర్ ! ఎక్కడ కావాలంటే అక్కడ దిగటానికి."

"ఎలికాపటరే! అది దూసుకు పోతుందా?"

"పోదు. గరుత్మంతుడల్లే రయ్యిన ఎగిరి వాల్తుంది. కారుకన్న నాలుగింతలు స్పీడు పోతుంది. నీ అంతకుడు కారులో వెళ్ళి అవతల వాణ్ని చంపేలోపల నువు డిటెక్షను పూర్తి చేసి ఇంటికి రావచ్చు."

"అహ తెరీ!" అన్నాడు భద్రం.

"ఆ ఎలికాపటర్లో గురోజీకేనా నాక్కూడా చోటుందా, శంకరం బాబో?"

"నువు దాన్ని? పైలట్ చెయ్యి, కావలిస్తే!"

"నాసామి రంగో! నా అదురుష్టం కుళ్ళిందిరో గురుడా! నా కూపి రాడటంపు లేదు రోరయ్యో! అహ తెరీ!"

"ఇదంతా ఎప్పుడిప్పిస్తారు, శంకరంగారూ?" అన్నాను, నా ఉక్కిరి బిక్కిరి అణుచుకుంటూ.

"ఎప్పుడోనా? ఇవాళ రాత్రి కూచున్నానంటే తెల్లారేటప్పటికి దించనూ?"

"మరింతకాలం ఎందుకిట్టా ఏడిపించుకు తిన్నారు శంకరం గారూ?"

"ఎందుకా? దిక్కుమాలిన ఇంగ్లీషు పుస్తకాలన్నీ తర్జుమా చెయ్యటం ఇష్టం లేక!"

"నా కర్థం కాలేదు, బాబుగారూ!" అన్నాను వినయంగా.

"అది మిస్టరీ! నీకే తెలుస్తుంది తరవాత!"

"అట్లా అవుతే ఇప్పుడు మీరు ఎందుకు అభిప్రాయం మారుసుకున్నారు శంకరం బాబూ?" అని భద్రం అడిగాడు.

"ఎవరో దుర్మార్గుడు నన్ను ఇన్సల్ట్ చేశాడు! చేతి వాటెయ్యటం నాకు చాత కాద న్నాడు. చూపిస్తా నా తడాఖా!"

శంకరంగారు ఉగ్రరంగా ఉన్నట్టు నేను కనిపెట్ట కలిగాను.

"నిన్ను ప్రపంచంలోకల్లా గొప్ప డిటెక్టివు చేస్తాను. జనం ఆనంద పారవశ్యంలో దొర్లి దొర్లి తోవతోవయేట్లు చేస్తాను!"

నాకు పుత్సాహం అంతగా రాలేదు. రాత్రి నేను కల్లో చూసిన డిటెక్టివుల విషయం చెప్పి, "నేను వాళ్ళకన్న ఎక్కువవుతానా? నమ్మను!" అన్నాను.

"నువు నమ్మవు! ఒక డిటెక్టివు గతి ఏమయేదీ చూపిస్తా! నా వెంట సెషన్సు కోర్టుకు రా!" అన్నాడు శంకరంగారు.

ముగ్గురం అదుర్దాగా బయలుదేరాం. సెషన్సు కోర్టు కిటకిట లాడుతున్నది. ఒక బోనులో ఒక అమ్మాయీ, అబ్బాయీ ఉన్నారు. వాళ్ళను ఎక్కడో చూసి నట్టనిపించింది. కాని ఎక్కడ చూసిందీ గ్న్యాపకం రాలా. ఇంకో బోనులో పోలీసిన స్పెక్టరు నుంచునున్నాడు. పబిలీకు ప్రాసిక్యూటరు ఏవేవో ప్రశ్నలు వేశాడు. ఏదో క్రిమినలు. సున్నం కంపెనీలో వాటాల విషయం మాట్లాడారు. నా కళ్ళు ముద్దాయిల తరఫు ప్లీడరుమీద విరుచుకు పడ్డాయి.

ఆయెన గుడ్డలమీద కిరసనాయిలు పోసి అంటించి మంటలు మింగుతున్నాడు. మధ్య మధ్య కాలిన బొగ్గులు నోట్లో వేసుకుంటున్నాడు.

"ఈ దెబ్బతో ఈ పోలీసినస్పెక్టరు పైసలా !" అని నాలో నేననుకోనే అనుకున్నాను.

"యు వార్ విట్నెస్", అన్నాడు పబిలీకు, ఈ మంటలు మింగే ఆయనతో.

"ఈ అబ్బాయీ అమ్మాయీ అంతకు లనటానికి మీకున్న ఒక ఆధారమూ ఏమిటి?"

"చేతి రుమాలు," అన్నాడు ఇనస్పెక్టరు. "దాంతోనే అంతకుడు హత్య చేశాడు !"

మంటలు మింగే ఆయన పెద్ద అంగలు వేసుకుంటూ జడిజీ ముందున్న బల్లమీద నించి ఒక రుమాలు మడతతీసి చూపిస్తూ "ఇదేనా, ఆ రుమాలు ?"

"యాస్ యూవర్ హానర్" అన్నారు ఇనస్పెక్టరు, జడిజీ కేసి తిరిగి.

"హత్య చేసిన రుమాలు ఇస్త్రీ చేసి ఉందేం ?"

లాయరు ముక్కూనోటా పొగలు వెళ్ళసాగాయి. అంత కిరసనాయిలు మంట మింగితే ఊరికే పోతుందా ?

"అది చాకలాడు ఇస్త్రీ పెట్టాడు," అన్నాడు ఇనస్పెక్టరు.

"అది మీకెక్కడ దొరికిందీ ?"

"అంతకుడి గదిలో !" ఇనస్పెక్టరు ఎందుకో భయపడుతున్నట్టు కనబడ్డది. "కాదు, చాకలాడి దగ్గిర రెండు రూపాయలు—కాదు, కాదు, హత్య జరిగిన చోట !"

"ఓహో ! అంతకుడు హత్యచేయటానికి ఉపయోగించిన రుమాలు చాకలాడి దగ్గిరికెళ్ళి, ఇస్త్రీ అయి, రెండు రూపాయలకు అమ్ముడు పోయి, ఏమీ ఎరగట్టు హత్య జరిగిన చోటికి వచ్చి పడుకుందా? అంతకుల్ని పట్టలేక మీ పోలీసులిట్లా సాక్ష్యాలు సృష్టిస్తారా? మీ చేతుల్లో న్యాయం పెట్టటం కంటే ఘోరం ఉంటుందా ?

ఇనస్పెక్టరు భయంతో తడిసి పోతున్నాడు.

"ఇది నా పనికాదు, యువర్ హానర్ ! ఇది ఈ డిటెక్టివు—"

"డిటెక్టివు బోనెక్కాడు. హంతకుల తరపు ప్లీడరు విడుస్తున్న పొగలు కోర్టంతా చుట్టేస్తున్నాయి. నాకేం కనపట్టం లేదు. "నిన్ను బొక్కలో తోయిస్తాను. ఇదా మీ డిటెక్టివులు చేసే పని. నా తడాఖా చూపిస్తాను !" అని వినిపిస్తున్నది.

నాకు వొళ్ళు తెలిసేటప్పటికి భద్రం మొహం కనిపించింది.

"ఎట్లా ఉంది, గురో ? అట్టా యిరుచుకు పడిపోయారేవిటి ? అన్నాడు భద్రం.

"ఏమయింది, కే యాస్ ?" అని శంకరం గారడుగుతున్నాడు.

"మీరు నన్ను నిజంగా డిటెక్టివు చేస్తాననేప్పటికి మయికం వచ్చేసింది, శంకరం గారూ !" అన్నాను హీనస్వరంతో.

"ఇంకా నయం. ఎవరన్నా యాటం పొడి చల్లారేమో ననుకున్నా ?" అన్నారు శంకరంగారు.

''యాటం పొడా ? అన్నాను వెంగెంగా.

''డిటెక్టివయ్యాక నీకే తెలుస్తుందిలే.''

''అదెందుకు, గురో ?'' అన్నాడు భద్రం.

''నన్నడుగుతావేం ? నాకసలేం తెలీకుండా అయోమయంగా ఉంటే ?'' అన్నాడు.

''యాటం పొడి చల్లితే మనిషి నిలువునా చచ్చినట్లయిపోయి మళ్ళీ వాడే బతుకుతాడు'' అన్నాడు శంకరంగారు.

''అడాళ్ళు కూడానా, శంకరంబాబూ ?'' అన్నాడు భద్రం.

''అయే ఉంటుంది,'' అన్నాడు శంకరం గారు.

''అదెక్కడ అమ్ముతుంది, శంకరం బాబూ ?''

''వి పచారీషాపుడునన్నా విచారించు !''

''అట్టా కరీం దుకాణాని కెళ్ళొత్తా, గురో !'' అంటూ భద్రం బయటికి పరుగెత్తాడు.

''అయితే, శంకరం గారూ ! నన్ను డిటెక్టివు చేస్తానన్నారే; ఎట్లా చేస్తారో కొంచెం చెప్పరూ ?'' అన్నాను వినయంగా.

''నిన్ను డిటెక్టివుగాపెట్టి పుస్తకం రాసేస్తా !'' అన్నాడు శంకరంగారు.

మిస్టరీ విచ్చిపోయింది !

ముద్రణ : 31 ఆగష్టు 1956, తెలుగుస్వతంత్ర.